సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం । 12 । జూలై । 2023



ఒకే ఇంట్లో మూడుసార్లు చోరీ
మిర్యాలగూడ మండలం అవంతీపురం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ఒకే ఇంట్లో మూడుసార్లు చోరీ చేశారు. - 8లో



హిజ్రాల మధ్య ఘర్షణ
మిర్యాలగూడలో రెండు గ్రూపుల హిజ్రాలు పోలీస్‌స్టేషన్ ఆవరణలో దాడి చేసుకున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
34°/26°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పంచాయతీ సెక్రటరీ సస్పెన్షన్

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామ పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న జమ్లానాయక్ సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఈ మేరకు కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలో చేపడుతున్న ఓ ఇంటి అక్రమ నిర్మాణానికి సంబంధించిన విషయంలో చర్యలు తీసుకోవడంలో విఫలం కావడంతో అతడిని కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు డీపీఓ సునంద తెలిపారు.

వారోత్సవాలపై అవగాహన కల్పించాలి



పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ

బీబీనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే వారోత్సవాల కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని డీఈఓ నారాయణరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. బీబీనగర్ మండలంలోని అన్నంపట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి, పఠనోత్సవ అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి, పఠన రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



అష్టోత్తర పూజలో పాల్గొన్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఆచార్యులు ఆకుపూజ నిర్వహించారు. స్వామి వారిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. ఇక ప్రధానాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు జరిగాయి. సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు చేపట్టారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు.

మైదానంలో ఏర్పాట్ల పరిశీలన

భువనగిరి: క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఈ నెల 12న భువనగిరి పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయ్య మంగళవారం మైదానాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో సకాలంలో హాజరు కావాలన్నారు. ఆయన వెంట పీడీలు బాలకృష్ణ, వెంకటరమణ, పీఈటీలు మల్లేష్, గోపాల్, మధుసూదన్, నాగరాజు, నరసింహ, చంద్రమౌళి, శేఖర్, ఛండిధర్, కేశనాగులు, కోటేశ్వర్‌రావు, ఐలయ్య తదితరులున్నారు.

లోకాయుక్త అధికారి విచారణ



జేసీబీతో తొలగించిన రోడ్డు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం రామాజీపేట గ్రామంలో లోకాయుక్త ఇన్వెస్టిగేటింగ్ అధికారి మ్యాథ్యూ కోషీ మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామంలో 73 సర్వే నంబర్‌లోని 12 గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించి వెంచర్ యాజమానులు రోడ్డు వేసుకున్నారని గ్రామానికి చెందిన మక్కల దుర్గయ్య గత సంవత్సరం జూన్‌లో లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు లోకాయుక్త అధికారి గ్రామానికి విచ్చేసి, రెవెన్యూ అధికారులతో మాట్లాడి సర్వే చేయించారు. ఈ సర్వేలో వెంచర్ యజమానులు ప్రభుత్వ భూమిని రోడ్డు కోసం ఆక్రమించారని తేలింది. 12 గుంటల భూమిలో 12 ఫీట్ల రోడ్డును రైతుల బాట కోసం వదిలేసి, మిగిలిన రోడ్డును జేసీబీ సాయంతో తొలగించారు. ఆయన వెంట తహసీల్దార్ జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ నర్సింగరావు ఉన్నారు.

అవిశ్వాసాల అలజడి

అధికార పార్టీకి ఇబ్బందిగా మండల పరిషత్ రాజకీయాలు

- బీఆర్ఎస్ ఎంపీటీసీ సభ్యులే విపక్షాలతో చెట్టాపట్టాల్
- కాంగ్రెస్, బీజేపీ సభ్యులతో కలిసి అవిశ్వాస తీర్మానాలు
- ఇప్పటికే నాలుగు చోట్ల ఎంపీపీలపై అవిశ్వాస నోటీసులు
- ఒకచోట తేరుకున్న ఎంపీపీ.. ఎంపీటీసీలతో గోవా టూర్



సంస్థాన్‌నారాయణపురం ఎంపీపీపై అవిశ్వాసం నోటీసును ఆర్డీఓకు అందజేస్తున్న ఎంపీటీసీలు (ఫైల్)

అధికార పార్టీకి అవిశ్వాసాల తలనొప్పి మొదలైంది. ఉమ్మడి జిల్లాలో అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యులే కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీల సభ్యులతో కలిసి సొంత పార్టీ ఎంపీపీలపై అవిశ్వాసాలు పెట్టాలంటూ అడిషనల్ కలెక్టర్, ఆర్డీఓలకు నోటీసులు అందజేస్తున్నారు. ఇప్పటికే నాలుగు చోట్ల ఎంపీపీలపై అవిశ్వాస నోటీసులు అందజేశారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో.. నియోజకవర్గాల్లో గ్రూపు రాజకీయాలతో ఇబ్బందులు తలెత్తుతుండగా, ఇప్పుడు ఎంపీపీలపై సొంత పార్టీ వారే అవిశ్వాసం పెట్టడం మరింత అలజడి రేపుతోంది.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: మండల ప్రజా పరిషత్‌లో పాలక వర్గాలు ఏర్పడి నాలుగేళ్లు పూర్తయింది. గతంలో ఎంపీపీలపై అవిశ్వాసం పెట్టేందుకు రెండేళ్ల కాలపరిమితి ఉండగా, దానిని ప్రభుత్వం నాలుగేళ్లకు పొడిగించింది. ప్రస్తుతం ఆ గడువు ముగియడంతో పాలక వర్గాల్లో అసంతృప్తులు భగ్గుమంటున్నాయి. ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యుల మధ్య సఖ్యత లేకపోవడం.. చాలా చోట్ల ఎంపీపీలపై వ్యతిరేకత ఉండటం ఈ పరిస్థితి కారణమైంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని నాలుగు చోట్ల ఎంపీపీలపై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటూ ఎంపీటీసీలు నోటీసులు అందజేశారు.

మరికొన్ని చోట్ల అంతర్గతంగా..

ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో నాయకుల మధ్య గ్రూపులు ఉన్నాయి. ఇప్పటికే ఐదు చోట్ల బయటకు రాగా, చాలాచోట్ల చోట్ల ఎంపీపీలపై ఎంపీటీసీలు లోలోపల వ్యతిరేకతతో ఉన్నారు. ఈ నేపథ్యంలో అవిశ్వాసాలను అడ్డుకునేందుకు అధికార పార్టీ అచీతూచీ అడుగులు వేయాల్సి వస్తోంది.

అన్నీ ఓకే అయితే..

ఎంపీపీని తొలగించేందుకు మూడింట రెండో వంతు మంది సభ్యులు మద్దతు పలకాలి. తిరిగి ఎన్నుకునేందుకు ఒక్క సభ్యుడు ఎక్కువున్నా సరిపోతుంది. అవిశ్వాసానికి సంతకాలు పెట్టించడంతోపాటు వారంతా అక్కడే ఉన్నట్లు అధికారి ఎదుట తెలియజేయాలి. వాటిని కలెక్టర్ పరిశీలించి.. అవిశ్వాసంపై సమావేశం నిర్వహణకు సంబంధిత ఆర్డీఓకు ఆదేశాలు ఇస్తారు. సమయం నిర్ణయించి అవిశ్వాస తీర్మానం పెడతారు. సభ్యులు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా ఉంటే 20 రోజుల్లో అవిశ్వాస ప్రక్రియ పూర్తవుతుంది.

ఇదీ పరిస్థితి..

- యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం ఎంపీపీ గుత్తా ఉమాదేవిపై అవిశ్వాసానికి నోటీసు అందజేశారు. 13 మంది ఎంపీటీసీలు ఉండగా, అందులో 9 మంది టీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం ఎంపీటీసీలు మొత్తం 11 మంది కలిసి ఈ నోటీసు ఇచ్చారు. నోటీసులో సంతకం చేసిన సీపీఎం ఎంపీటీసీ వినోద్‌రెడ్డి మూడురోజుల కిందట మరణించారు.
- నల్లగొండ జిల్లా చండూరు ఎంపీపీ పల్లె కళ్యాణి అధికార పార్టీ ఎంపీపీ. ఆమెపై అవిశ్వాసం కోరుతూ 9 మంది ఎంపీటీసీలు కలిసి ఆర్డీఓ, అదనపు కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసు అందజేశారు. మండలంలో 11 మంది ఎంపీటీసీలు ఉండగా, అందులో పుల్లెంల ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ అయిన మందడి నర్సింహారెడ్డి ఇటీవల మృతి చెందారు. దీంతో ఎంపీటీసీల సంఖ్య 10కి తగ్గింది. ఎంపీపీని మినహాయిస్తే ఆరుగురు బీఆర్ఎస్ ఎంపీటీసీలు, ముగ్గురు బీజేపీ ఎంపీటీసీలు జట్టుగా ఏర్పడి అవిశ్వాస నోటీసు అందజేశారు.
- మర్రిగూడ మండల అధికార పార్టీ ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డిపై అవిశ్వాసానికి నోటీసులు అందించారు. మొత్తం 11 మంది ఎంపీటీసీలు ఉండగా 8 మంది అవిశ్వాసానికి అనుకూలంగా సంతకాలు చేశారు. అందులో ఐదుగురు బీఆర్ఎస్ వారు ఉండగా, ముగ్గురు బీజేపీ ఎంపీటీసీలు కలిసి దేవరకొండ ఆర్డీఓకు అవిశ్వాస నోటీసు అందజేశారు.
- సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలో 7 ఎంపీటీసీ స్థానాలు కాగా, అందులో కాంగ్రెస్ 4, బీఆర్ఎస్ 3 గెలుపొందాయి. మొదట ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఇద్దరూ కాంగ్రెస్ పార్టీకి చెందినవారే ఉండగా.. ఆ తర్వాత ఎంపీపీ గూడపు శ్రీనివాస్‌తోపాటు లక్కవరం ఎంపీటీసీ సభ్యుడు బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో అధికార బీఆర్ఎస్ పార్టీకి ఐదుగురు ఎంపీటీసీలు అయ్యారు. ఎంపీపీ కూడా బీఆర్ఎస్‌కు చెందిన సభ్యుడే అయ్యాడు. ప్రస్తుతం అక్కడ బీఆర్ఎస్ ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీపై అసమ్మతి గళం విప్పారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నలుగురు ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీకి చెందిన వైస్ ఎంపీపీ సింగతల సైదమ్మ కలిసి ఎంపీపీపై అవిశ్వాసానికి సై అన్నారు. ఈ మేరకు ఆర్డీఓకు నోటీసు ఇచ్చారు.

గోవా క్యాంపులో మునుగోడు ఎంపీటీసీలు

మునుగోడు మండలంలో మొత్తం 13 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. అందులో ఒక ఎంపీటీసీ మరణించగా, సభ్యుల సంఖ్య 12కు తగ్గింది. వారిలో బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 1, సీపీఎం 1, సీపీఐ 1 చొప్పున ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీపీ కర్నాటి స్వామిపై అదే పార్టీకి చెందిన వైస్ ఎంపీపీ అనంత వీణ లింగస్వామి అవిశ్వాసం పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు బయటకు పొక్కింది. దీంతో అప్రమత్తమైన ఎంపీపీ.. బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు, కాంగ్రెస్, సీపీఐకి చెందిన ఒక్కో సభ్యుడిని తీసుకొని గోవా ట్రిప్‌కు వెళ్లినట్లు సమాచారం. దీంతో అక్కడ ఇంకా నోటీసు ఇవ్వలేదు.



ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పాల్గొన్న డీఎంహెచ్ఓ మల్లికార్జున్‌రావు

జనాభా నియంత్రణతోనే ఆర్థికాభివృద్ధి

- కలెక్టర్ పమేలా సత్పతి



మహిళకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరి: జనాభా నియంత్రణతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమగ్ర ప్రణాళికలతోనే జనాభా నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. కుటుంబ నియంత్రణలో భాగంగా ఆడవారికి టుబెక్టమీ చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు రావడం జరుగుతుందని, మగవారికి కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించి వ్యాసెక్టమీ ఆపరేషన్ చేయించుకునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఐయూసీడీ, పీపీ ఐయూసీడీ వంటి తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం డీఎంహెచ్ఓ మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ నిరక్షరాస్యత, బాల్యవివాహాలు, మగబిడ్డ కోసం ఎదురు చూడటం, పెళ్లి జరిగిన వెంటనే సంతానం కలగడం వంటి కారణాలతో జనాభా పెరుగుతుందన్నారు. గ్రామాలు, పట్టణాల్లో జనాభా నియంత్రణపై అవగాహన కల్పించేందుకు ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని కోరారు. అంతకు ముందు జిల్లా కేంద్ర ఆస్పత్రి నుంచి ప్రారంభమైన అవగాహన ర్యాలీని డీఎంహెచ్ఓ ప్రారంభించారు. అనంతరం ఒక బిడ్డ తర్వాత శాశ్వత కుటుంబ నియంత్రణ, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతి పాటించిన దంపతులకు రూ.1000 నగదు ప్రోత్సాహకంతోపాటు, ప్రశంస పత్రాలు అందజేశారు. కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించడం, ఉత్తమ సేవలందించిన వారికి కలెక్టర్ ప్రశంస పత్రాలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ యశోద, పరిపూర్ణాచారి, పాపారావు, వినోద్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

విధులు పారదర్శకంగా నిర్వర్తించాలి



సమావేశంలో పాల్గొన్న డీఆర్‌డీఓ నాగిరెడ్డి

భూదాన్‌పోచంపల్లి: జాతీయ ఉపాధిహామీ పనులను పారదర్శకంగా నిర్వర్తించాలని డీఆర్‌డీఓ నాగిరెడ్డి అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండలంలో ఉపాధి హామీ పథకం కింద 2021 డిసెంబర్ నుంచి మార్చి 2023 వరకు చేపట్టిన పనులపై 14వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. అనంతరం డీఆర్‌డీఓ మాట్లాడుతూ మండలంలో చేపట్టిన 926 పనులకు వేతనాలు రూ.5.35 కోట్లు, మెటీరియల్స్‌కు రూ.95 లక్షలు, మొత్తం రూ.6.31 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అసిస్టెంట్ పీడీ శ్యామల, ఎంపీడీఓ బాలశంకర్, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ చెన్నకేశవ, సహాయ విజిలెన్స్ అధికారి చండీరాణి, మేనేజర్ సంపత్, అసిస్టెంట్ మేనేజర్ ఆదిత్య, ఏపీఓ కృష్ణమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి



కార్మిక సంఘాల జేఏసీ సమావేశంలో నాయకులు

భువనగిరిటౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్ అన్నారు. మంగళవారం భువనగిరిలోని రహదారి బంగ్లాలో నిర్వహించిన కార్మిక సంఘాల జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి దశలవారీగా ఆందోళనలు చేస్తామన్నారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు సుడుగు జీవన్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మహమ్మద్ ఇమ్రాన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు, ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రామచంద్రయ్య, ఏటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ, ఐఎన్‌టీయూసీ చౌటుప్పల్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి బెజాడి కుమార్, కుక్క దానయ్య, చరణ్, చంద్రయ్య పాల్గొన్నారు.

గుట్టుగా సరిచేశాడు!

- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అడెస్సీవ్ స్టాంపుల సొమ్ము మాయం
- ఉద్యోగి నిర్వాకాన్ని ఆలస్యంగా గుర్తించిన అధికారులు
- సొమ్మును తిరిగి జమచేసిన సదరు ఉద్యోగి
- శాఖా పరమైన విచారణకు జిల్లా రిజిస్ట్రార్ ఆదేశం



చౌటుప్పల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

చౌటుప్పల్ : చౌటుప్పల్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలంలో ఏకంగా ప్రభుత్వ సొమ్మునే దిగమింగాడు. అడెస్సీవ్ స్టాంపులు అమ్మిన సొమ్మును జేబులో వేసుకున్నాడు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆస్తుల రిజిస్ట్రేషన్లతో పాటుగా బాండ్ పేపర్లు, అడెస్సీవ్ స్టాంపులు వంటివి విక్రయిస్తారు. ఇందుకు ప్రత్యేకంగా ఓ ఉద్యోగి (ష్రాఫ్ అంటారు)ని కేటాయిస్తారు. రోజువారీగా బాండ్ పేపర్లు, స్టాంపులు అమ్మకాలకు సంబంధించి రికార్డు నమోదు చేయడంతోపాటు వచ్చిన సొమ్మును ప్రభుత్వ అకౌంట్‌లో జమ చేయాల్సి ఉంటుంది. అందులో బాగంగా బ్యాంకుల రుణాలు, చిట్‌ఫండ్ లావాదేవీలు, ఇతర అవసరాల నిమిత్తం వినియోగించే 20, 50, 100రూపాయల అడెస్సీవ్ స్టాంపులు(అతికించే టికెట్లు) కూడా అమ్ముతారు. అయితే, చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ష్రాఫ్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి రూ.2లక్షల అడెస్సీవ్ స్టాంపుల విక్రయ సొమ్మును మాయం చేశాడు. వివరాలు సైతం రికార్డుల్లో నమోదు లేకుండా జాగ్రత్తపడ్డాడు. ఇటీవల స్టాంపుల అమ్మకాల విధానం పూర్తిగా ఆన్‌లైన్ పద్ధతిలోకి మారింది. ఈ క్రమంలో ఉన్నతాధికారులు తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో ఈ తతంగం వెలుగులోకి వచ్చింది.

సొమ్ము తిరిగి చెల్లించిన ఉద్యోగి

స్టాంపుల విక్రయ సొమ్ము మాయమైన ఘటన సుమారుగా రెండు నెలల క్రితం వెలుగు చూసింది. ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో సదరు ఉద్యోగి వెంటనే తేరుకున్నాడు. ఉద్యోగానికి ఎసరు వస్తుందని భావించి అప్పటికప్పుడు రూ.2లక్షలను సంబంధిత అకౌంట్‌లో జమ చేశాడు. ఈ అంశాన్ని సీరియస్‌గానే పరిగణించిన ఉన్నతాధికారులు అతనిపై శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. అందులో భాగంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారించారు. సదరు ష్రాఫ్‌ను ఇక్కడి నుంచి రామన్నపేట కార్యాలయానికి పంపించారు. సూత్రధారులు, పాత్రధారులు ఎవరనే అంశాపై పూర్తి స్థాయిలో విచారణ ప్రారంభించారు.

విచారణ చేస్తున్నాం

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అడెస్సీవ్ స్టాంపులకు విక్రయాలకు సంబంధించిన అవకతవకలపై దృష్టిసారించాం. శాఖాపరమైన విచారణ చేస్తున్నాం. ష్రాఫ్.. స్టాంపుల విక్రయ సొమ్మును అకౌంట్‌లో జమ చేశాడు. ప్రస్తుతం అతన్ని ఇక్కడ విధుల నుంచి తప్పించాం. విచారణ అధారంగా తగిన చర్యలు తీసుకుంటాము.

– బి.ప్రవీణ్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్

నేడు విద్యాసంస్థల బంద్

భువనగిరి: విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం చేపట్టే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, ప్రగతి శీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి బేజాడి కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

డంపింగ్ యార్డుల పరిశీలన

భువనగిరి: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా మంగళవారం మండలంలోని తుక్కాపురం, వడాయిగూడెం గ్రామాలను లైజన్ ఆఫీసర్ శ్యామల సందర్శించారు. ఆయా గ్రామాల్లో హ్యాండ్ వాషింగ్ సౌకర్యం, సింగిల్ పిట్ టాయిలెట్లు, డంపింగ్ యార్డులు, ఇంకుడు గుంతలు, డ్రెయినేజీలు పరిశీలించారు. అనంతరం గ్రామాల్లో పంచాయతీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆమె వెంట ఎంపీడీఓ గుత్తా నరేందర్ రెడ్డి, ఎంపీఓ అనురాధ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రోడ్లు ఊడుస్తూ స్కూల్ స్వీపర్ల నిరసన



రోడ్డు ఊడ్చుతూ నిరసన తెలుపుతున్న స్వీపర్లు

భువనగిరిటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ స్కూల్ స్వీపర్లు జెడ్పీ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె మంగళవారం 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు రోడ్లు ఊడుస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. స్కూల్ స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గాదె చంద్రయ్య మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనం రూ.27వేలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వడ్డెమాను నరసింహ, ఉపాధ్యక్షుడు బైరు జంగయ్య, సహాయ కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి తూముకుంట రమేష్, కార్యవర్గ సభ్యులు బాలమణి, భిక్షపతి, స్వామి పాల్గొన్నారు.

స్వచ్ఛతలో ముందుండేలా..

- స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకు సాధించేందుకు చర్యలు చేపట్టిన మున్సిపల్ అధికారులు
- స్వచ్ఛత ఉత్సవ్ పేరుతో అవగాహన కార్యక్రమాలు
- ప్రారంభమైన ప్రజాభిప్రాయ సేకరణ
- ఆగస్టు 15లోపు తనిఖీలు చేయనున్న ప్రత్యేక బృందాలు



ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

భువనగిరిటౌన్: పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చేందుకు మున్సిపాలిటీలకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలు నిర్వహించి దేశ వ్యాప్తంగా ర్యాంకులు ప్రకటిస్తోంది. ఈ మేరకు ర్యాంకు సాధించేందుకు జిల్లాలోని భువనగిరి, చౌటుప్పల్, ఆలేరు, యాదగిరిగుట్ట, పోచంపల్లి, మోత్కూర్ మున్సిపాలిటీల్లో అధికారులు చర్యలు మొదలుపెట్టారు. అయితే ఏటా ఒక్కో అంశాన్ని తీసుకుని స్వచ్ఛత ర్యాంకులు ఇస్తుండటమే కాకుండా మార్కులను కూడా పెంచుతుండటంతో పరిశుభ్రత విషయంలో సవాల్‌గా మారింది. ఈసారి చెత్తతో సంపద (వేస్ట్ టు వెల్త్) నినాదంతో ముందుకొచ్చారు. ఇప్పటికే మున్సిపాలిటీల్లో ఆర్ఆర్ఆర్, స్వచ్ఛత ఉత్సవ్ పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ర్యాంకుల కేటాయింపు ఇలా..

అంశం	మార్కులు	శాతం
సేవా స్థాయి పురోగతి	4,830	51
సర్టిఫికెట్ల జారీలో..	2,500	26
ప్రజల అభిప్రాయం	2,170	23

మూడు అంశాలు.. 9,500 మార్కులు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లోని ప్రాధాన్య అంశాలు మారాయి. గతేడాది కంటే ఈ సంవత్సరం 2వేల మార్కులు పెరిగాయి. ప్రస్తుతం పారిశుద్ధ్య పనులకు అధిక మార్కులు కేటాయించారు. మూడు అంశాలను పరిగణనలోకి తీసుకొని 9,500 మార్కులుగా విభజించారు. చెత్త వేరు చేయడం, తరలించడం, సఫాయి మిత్ర సురక్ష వంటివి ఇందులో ఉన్నాయి. చెత్త రహిత పట్టణాలుగా తీర్చిదిద్దడంతో పాటు మరుగుదొడ్ల నిర్వహణ, మురుగు నీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు సుమారు 36 అంశాలను గుర్తించాల్సి ఉంటుంది.

ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభం

పురపాలికల్లో ఈనెల 5వ తేదీ నుంచి స్వచ్ఛతపై పౌర స్పందన ప్రారంభమైంది. పట్టణ పరిశుభ్రతపై మొత్తం 3 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇంటి నుంచి రోజూ చెత్త సేకరణ, తడి, పొడి వేరు చేయడం, డ్రెయినేజీలు, నాలాల శుభ్రత, ఆర్ఆర్ఆర్‌పై అవగాహన కేంద్రాల ఏర్పాటు, ప్రజా మరుగుదొడ్లు ఏవిధంగా ఉన్నాయి. డిజిటల్ మ్యాప్‌లో సులభ్ కాంప్లెక్స్‌ల దారి చూపడం లాంటి అంశాలు, పట్టణంలో పాటు ఇంటి పరిసరాల పరిశుభ్రతపై సమాచారాన్ని సేకరిస్తున్నారు.

మెరుగైన ర్యాంకు సాధించేందుకు కృషి



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా మెరుగైన ర్యాంకు సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆదేశాలను కచ్చితంగా పాటిస్తున్నాం. ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుంది. వారం, పది రోజుల్లో పరిశీలన బృందం భువనగిరి మున్సిపాలిటీలో పర్యటించే అవకాశం ఉంది.

– నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

ఆగస్టు 15లోగా తనిఖీలు..

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే ప్రారంభం కావడంతో క్షేత్ర స్థాయిలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు చెందిన థర్డ్ పార్టీ క్షేత్ర బృందాలు తనిఖీ చేసే అవకాశముంది. ఆగస్టు 15లోగా మున్సిపాలిటీల్లో పరిశీలించి అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తారు. గతంలో మాదిరిగా మున్సిపల్ అధికారులు వీరి వెంట ఉండరు.

క్లుప్తంగా

నేటి పరీక్షలు వాయిదా

నల్లగొండ రూరల్: పలు విద్యార్థి సంఘాలు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో బుధవారం జరగాల్సిన ఐపీసీ, ఐఎంబీఏ, బీటెక్, లా పరీక్షలను వాయిదా వేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి మిర్యాల రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తిరుమలగిరి (తుంగతుర్తి): మండల కేంద్రంలో సూర్యాపేట–జనగామ ప్రధాన రహదారి పక్కన ఓ వ్యక్తి మృతదేహం కనిపించినట్లు స్థానికులు మంగళవారం తిరుమలగిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా మృతుడు జనగామ జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ జలీల్‌గా పోలీసులు గుర్తించారు. జలీల్ గత కొద్దిరోజులుగా తిరుమలగిరి పరిసర ప్రాంతాల్లో గుడిసెలు వేసుకొని స్టౌలు రిపేర్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని, అతడి భార్య ఏడాది క్రితం మృతిచెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. జలీల్ ఈ నెల 8వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని బంధువులు తెలిపారు. మృతుడి తమ్ముడు సయ్యద్ ఆరిఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


వీరయ్య (ఫైల్)

మేళ్లచెరువు: వ్యవసాయ మోటారుకు కరెంట్ వైరు లాగే క్రమంలో విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందిన ఘటన మేళ్లచెరువు మండలంలోని కందిబండ గ్రామ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సురేష్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. కందిబండ గ్రామానికి చెందిన చిలికేశ్వరపు వీరయ్య(49) తనకున్న మూడు ఎకరాల భూమితో పాటు అదే గ్రామానికి చెందిన పొనగండ్ల మధుసూదన్‌రెడ్డి వద్ద మరో 5ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. కౌలుకు చేసే పొలంలో వ్యవసాయ మోటారు బిగించేందుకు కరెంట్ వైరు లాగుతుండగా దగ్గరలోని 11కేవీ లైన్‌కు వైరు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య వీరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఢిల్లీలో ఆత్మహత్య చేసుకున్న గుండెపురి వాసి

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామానికి చెందిన గుండెబోయిన స్వరూప (27) ఆదివారం దేశ రాజధాని ఢిల్లీలో తాము ఉంటున్న ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్వరూప భర్త సతీష్ ఢిల్లీలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. స్వరూప మృతదేహానికి మంగళవారం గుండెపురి గ్రామంలో కుటుంబ సభ్యులు, బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలికి 4 సంవత్సరాల కుమారుడు, 2 సంవత్సరాల కుమార్తె ఉన్నారు. కాగా ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదు.

నాటుసారా స్థావరాలపై పోలీసుల దాడులు

మేళ్లచెరువు: మండలంలోని నాటుసారా స్థావరాలపై మంగళవారం ఎక్సైజ్, సివిల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 400 లీటర్ల బెల్లం పానకం, డ్రమ్ములు, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో కోదాడ రూరల్ సీఐ రామకృష్ణ, మేళ్లచెరువు ఎస్ఐ సురేష్‌యాదవ్, ఎక్సైజ్ ఎస్ఐ వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే ఇంట్లో మూడుసార్లు చోరీ

- రెండు నెలల్లో విలువైన వస్తువులు ఎత్తుకెళ్లిన దొంగలు
- ఇద్దరు అనుమానితులను విచారిస్తున్న పోలీసులు?


చోరీ జరిగింది ఈ ఇంట్లోనే..


ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ రాంమూర్తి

మిర్యాలగూడ టౌన్: గుర్తుతెలియని వ్యక్తులు రెండు నెలల కాలంలో ఒకే ఇంట్లో మూడుసార్లు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అవంతీపురం గ్రామానికి చెందిన వెంకట్రావు, జ్యోతి దంపతులు రెండున్నర నెలల క్రితం అమెరికాలో ఉంటున్న తమ కుమారుడి వద్దకు వెళ్లారు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యకులు గత నెల మొదటి వారంలో ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు కానీ.. ఎలాంటి వస్తువులు ముట్టుకోలేదు. అదే నెల చివరి వారంలో మరోసారి ఇంట్లోకి వెళ్లి బీరువాను కట్టర్‌తో కట్ చేశారు. కానీ బీరువాలోని వస్తువులు ముట్టుకోకుండా టీవీ, ల్యాప్‌ట్యాప్ దొంగిలించారు. ఆ ఇంటికి సమీపంలో ఎలాంటి గృహాలు లేకపోవడంతో ముచ్చటగా మూడోసారి సోమవారం అర్ధరాత్రి 12గంటల సమయంలో నేరుగా టాటా ఏస్ వాహనాన్ని తీసుకొచ్చి ఇంట్లో ఉన్న రెండు ఫ్రిడ్జ్‌లు, పట్టు చీరలు, గ్యాస్, బాత్‌రూంలోని గీజర్‌తో పాటు ఇతర వస్తువులు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం స్థానికులు గమనించి స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుకు సమాచారం అందించారు. ఆయన విషయాన్ని మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరికి తెలియజేశారు. డీఎస్పీ వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సమీపంలో నివసిస్తున్న వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ ముత్యాల రాంమూర్తి కూడా అక్కడకు చేరుకొని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. అనంతరం నల్లగొండ నుంచి వచ్చిన క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలు సేకరించారు. వెంకట్రావు బంధువు రమాకాంత్‌రావు మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐదుగురు కలిసి చోరీ..

కాగా తెలిసిన వారే ఈ చోరీలకు పాల్పడి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అవంతీపురం గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు కలిసి ఒక టీంగా ఏర్పడి టాటా ఏస్ వాహనంలో అన్ని వస్తువులు తీసుకుపోయారని, ఇతర ప్రాంతాల వారైతే ఇంత ధైర్యంగా వచ్చి ఉండరని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు?

గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై అనుమానం రావడంతో మిర్యాలగూడ రూరల్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ ఇద్దరు వ్యక్తులు గతంలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారని, వారికి గ్రామానికి చెందిన వ్యక్తులకు ఏమైనా సహకరించారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. మంగళవారం సాయంత్రం ఐదుగురు వ్యక్తులు కలిసి గ్రామ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో మద్యం సేవించారనే ప్రచారం సాగుతోంది. ఆ ఐదుగురులో వీరు ఏమైనా ఉన్నారా అనే అనుమానంతో పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

బొలేరోను ఢీకొట్టిన ఐషర్ వ్యాన్

- ఇద్దరు మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- మృతులు, క్షతగాత్రులు సూర్యాపేట జిల్లా చింతలపాలెం వాసులు
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా బాపులపాడు మండలంలోని ఉమామహేశ్వరపురం వద్ద ఘటన


మతీన్


నాగుల్‌మీరా


ప్రమాదానికి గురైన బొలేరో

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా బాపులపాడు మండలం ఉమామహేశ్వరపురం వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. సూర్యాపేట జిల్లా చింతలపాలెంకు చెందిన షేక్ నాగుల్ మీరా, షేక్ మతీన్, బండారు రామకృష్ణ, నాగరాజు సుబ్రహ్మణ్య కిరణ్‌కుమార్ బొలేరో వాహనంలో యానాం వెళ్లారు. అక్కడి నుంచి సోమవారం రాత్రి తిరిగి స్వగ్రామానికి ప్రయాణమయ్యారు. వీరు మార్గమధ్యలో ఉమామహేశ్వరపురం వద్ద మూత్రవిసర్జన నిమిత్తం కారు రోడ్డు పక్కన ఆపి కిందకు దిగారు. ఈ సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఐషర్ వ్యాన్ అదుపుతప్పి ఆగి ఉన్న బొలేరో వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బొలెరో వాహనం దగ్గర నిలబడి ఉన్న షేక్ నాగుల్ మీరా (26), షేక్ మతీన్(26) అక్కడికక్కడే మృతిచెందాడు. వీరితో పాటే ఉన్న బండారు రామకృష్ణ, నాగరాజు సుబ్రహ్మణ్య కిరణ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వీరవల్లి పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చిన్నవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాలకు తరలించారు. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రమాదానికి గురైన బొలెరో, ఐషర్ వ్యానులను పక్కకు తొలగించారు. షేక్ నాగుల్ మీరా, షేక్ మతీన్‌ల మృతదేహాలకు గన్నవరం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. వీరవల్లి ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చింతలపాలెంలో విషాదఛాయలు..

హుజూర్‌నగర్: షేక్ మతీన్, షేక్ నాగుల్‌మీరా మృతితో చింతలపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మతీన్‌కు భార్య, 4 నెలల కుమార్తె ఉంది. నాగుల్‌మీరా అవివాహితుడు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని మంగళవారం జూలకంటి సందర్శించి వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఆరు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉంచడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, ఎంసీపీఐయూ రాష్ట్ర నాయకుడు మట్టయ్య, నాయకులు ఎండీ.సయ్యద్, బంటు రాజేశ్వరి, ధీరావత్ లింగానాయక్, మల్లు గౌతంరెడ్డి, రవినాయక్, జగదీశ్చంద్ర, సైదమ్మ, కాశీరాం, సరళ, విజయలక్ష్మి, వెంకాయమ్మ, సత్యవతి, మట్టమ్మ, అంజమ్మ, నిర్మల, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్‌లు చేస్తే చర్యలు తప్పవు

హుజూర్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలో అక్రమ లేఅవుట్‌ల యాజమాన్యాలపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని మేళ్లచెరువు రోడ్డులో, సీతారాంపురం బైపాస్ రోడ్డులో అక్రమంగా ఏర్పాటు చేసిన నాలుగు లే అవుట్ హద్దులను మంగళవారం చెరిపివేశారు. మున్సిపల్ అధి కారులు, సిబ్బందితో చెరిపి వేసి రాళ్లు తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ లే- అవుట్‌లు ప్లాట్లుగా చేసి అమ్ముతునాన్నరన్నారు. ఆ అక్రమ లే-అవుట్‌లలో ప్లాట్లు కొన్నవారి ఇంటి నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వడం, వసతులు కల్పించడం జరగదని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యాకుబ్‌పాష, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


హద్దురాళ్లు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

హిజ్రాల గ్రూపుల మధ్య ఘర్షణ

- పోలీస్ స్టేషన్ ఆవరణలోనే పరస్పరం దాడి


మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో కొట్టుకుంటున్న హిజ్రాలు

మిర్యాలగూడ అర్బన్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో రెండు గ్రూపుల హిజ్రాలు పోలీస్ స్టేషన్ ఆవరణలోనే ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. మిర్యాలగూడ పట్టణంలో రెండు హిజ్రాల గ్రూపులు ఉన్నాయి. ఆ గ్రూపులకు నందిని, బాలమ్మ నాయకత్వం వహిస్తుండగా కొన్ని నెలలుగా వ్యాపార సముదాయాల వద్ద డబ్బులు వసూలు చేసే విషయంలో ఈ రెండు గ్రూపుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గత కొద్ది రోజుల క్రితం నందిని గ్రూపులోని గంగభవాని అనే హిజ్రా బాలమ్మ గ్రూపులోకి వెళ్లగా.. తమ గ్రూపుకు చెందిన హిజ్రాను మీరు ఎలా తీసుకుంటారని బాలమ్మ గ్రూపు హిజ్రాలు నందిని గ్రూపుపై గొడవకు దిగారు. దీంతో ఈ రెండు గ్రూపుల మధ్య వివాదం పెద్దది కావడంతో పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఇరు వర్గాల గ్రూపులలో ఇద్దరు చొప్పున పోలీస్ స్టేషన్‌కు రావాలని పోలీసులు సూచించగా రెండు గ్రూపుల హిజ్రాలు సుమారు వంద మందికి పైగా పోలీస్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సమయంలో పోలీస్ స్టేషన్‌లో ఎదురు పడిన రెండు గ్రూపుల హిజ్రాల మధ్య మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు జుట్లు పట్టుకుని దాడి చేసుకున్నారు. రాళ్లు విసరడంతో ఒక్కసారిగా పోలీస్టేషన్ రణరంగమైంది. పోలీసులు వారిని వారిస్తుండగా కూడా రాళ్ల దాడి జరగడంతో కొందరు కానిస్టేబుళ్లు, మహిళా హోంగార్డులకు సైతం రాళ్లు తగలాయి. దీంతో పోలీసులు లాఠీలు చేతపట్టి హిజ్రాలను చెదరగొట్టారు. పరస్పరం దాడులకు పాల్పడిన రెండు గ్రూపులలోని 20మంది హిజ్రాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

పోలీసు పేరుతో బెదిరింపులు

మోత్కూరు: డబ్బా కొట్టు నిర్వహిస్తున్న మహిళను తాను పోలీసునని చెప్పి గుర్తుతెలియని వ్యక్తి బెదిరించిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజన్నగూడెం రహదారి వెంట వనం పద్మ డబ్బా కొట్టు నిర్వహిస్తోంది. సోమవారం రాత్రి 7.50గంటల సమయంలో డబ్బా కొట్టు వద్దకు హెల్మెట్, జర్కిన్ ధరించిన వ్యక్తి బైక్‌పై వచ్చాడు. గుట్కా ఉందా అని అడిగాడు. దీంతో పద్మ అతడికి గుట్కా ప్యాకెట్ ఇచ్చి డబ్బులు అడిగింది. దీంతో సదరు వ్యక్తి ×నేను పోలీస్ కానిస్టేబల్‌ను.. నన్నే డబ్బులు అడుగుతావా.. నువ్వు బెల్టు షాపు ఎలా నిర్వహిస్తావ్.. అని బెదిరించి రెండు బీర్లు, తినుబండారాలు, థమ్సప్ బాటిల్ ఇవ్వాలని అడిగాడు. దీంతో పద్మ అతడు అడిగినవి ఇవ్వడంతో వాటిని తీసుకొని మోత్కూరు వైపు వెళ్లాడని బాధితురాలు తెలిపింది. ఈ విషయమై ఎస్ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిని వివరణ కోరగా.. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అప్పు ఇచ్చిన వ్యక్తి మోసం చేశాడని ఆరోపణ

- తమ భూమిని సేల్ డీడ్ చేయించుకొని బెదిరిస్తున్నాడని వాపోయిన బాధితులు

మోత్కూరు: తమ అవసరం నిమిత్తం కుదవపెట్టిన ఇంటి స్థలాన్ని అప్పు ఇచ్చిన వ్యక్తి సేల్ డీడ్ చేయించుకున్నాడని మోత్కూరు మున్సిపాలిటీకి ఇద్దరు అన్నదమ్ములు వాపోయారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని జంగాల కాలనీకి చెందిన కడమంచి ఎల్లస్వామి, కడమంచి భిక్షం అన్నదమ్ములు. ఇరువురు ఇదే కాలనీకి చెందిన పత్తి భాష అలియాస్ శివ వద్ద రూ.5లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఇందుకుగాను తమ 240 గజాల ఖాళీ స్థలాన్ని కుదువ పెట్టారు. తీసుకున్న అప్పుకు తాము నెలకు రూ.10 వడ్డీ చొప్పున రూ.12 లక్షలు చెల్లించామని, అయినప్పటికీ బాషా తమ భూమిని మార్టిగేజ్ చేయించుకుంటామని చెప్పి సేల్ డీడ్ చేయించుకున్నాడని బాధితులు ఆరోపించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే కోర్టులో తేల్చుకుందామని బెదిరిస్తున్నాడని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఇదే విషయమై బాషాను వివరణ కోరగా.. అన్నదమ్ముల పొత్తులో ఉన్న ఇంటి స్థలాన్ని అప్పు కింద తనకు రిజిస్ట్రేషన్ చేశారని, ఇంకా తనకు రూ.4.80 లక్షలు ఇవ్వాల్సి ఉండగా అడిగినందుకు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని తెలిపాడు.

విధులకు ఆటంకం.. ముగ్గురి రిమాండ్

శాలిగౌరారం: మండలంలోని భైరవునిబండ గ్రామంలో మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకోవడంతో పాటు అక్కడకు వచ్చిన అధికారుల పట్ల దురుసుగా ప్రవర్తించిన గ్రామానికి చెందిన కోతి దశరథ, కోతి కరుణాకర్, కోతి యాదగిరిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. అరెస్ట్ చేసిన ముగ్గురిని నకిరేకల్‌లోని జుడీషియల్ ప్రథమశ్రేణి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించడంతో నల్లగొండ జైలుకు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి


యాదయ్య మృతదేహం

కట్టంగూర్: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన ఘటన కట్టంగూర్ మండలంలోని ముత్యాలమ్మగూడెంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యాలమ్మగూడెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కాడింగు యాదయ్య(59) రోజుమాదిరిగా సోమవారం రాత్రి కల్లు గీసేందుకు గ్రామ సమీపంలో తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలైన యాదయ్యను కుటుంబ సభ్యులు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని మంగళవారం జెడ్పీటీసీ సభ్యుడు తరాల బలరాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, ఎంపీటీసీ మల్లెబోయిన శ్రీలతాకృష్ణ పరామర్శించారు.

పొలం గట్టుపై వెళ్తుండగా రైతుపై దాడి


గాయపడిన గోపిరెడ్డి

చిలుకూరు: తన పొలం గట్టు గుండా ఎందుకు వెళ్తన్నావంటూ ఓ రైతుపై మరో రైతు దాడి చేసిన ఘటన చిలుకూరు మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. చిలుకూరు మండల కేంద్రానికి చెందిన నాగిరెడ్డి గోపిరెడ్డి తన పొలం వద్దకు వెళ్లేందుకు పక్కనే ఉన్న నాగిరెడ్డి నారాయణరెడ్డి పొలం గట్టు గుండా వెళ్తుండగా.. నారాయణరెడ్డి గమనించి ×నా పొలం నుంచి ఎందుకు వెళ్తున్నావు? అంటూ వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో నారాయణరెడ్డి బండరాయితో గోపిరెడ్డిపై దాడి చేయగా ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి ఇరువురు చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. కాగా విచారణ చేసి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ చల్లా శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్.. ఇద్దరు దుర్మరణం


లింగరాజు (ఫైల్)


రుత్విక (ఫైల్)


సూర్యాపేట రూరల్: బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో మేనమామ, కోడలు దుర్మరణం చెందారు. ఈ ఘటన సూర్యాపేట మండలంలోని యర్కారం గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మండలం కంచుగట్లగూడెం గ్రామానికి చెందిన పేరబోయిన లింగరాజుయాదవ్(25) తన మేనకోడలు రుత్వికతో కలిసి సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని రాయినిగూడెంలో ఉంటున్న తన చెల్లెలు ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో యర్కారం గ్రామ సమీపంలో కందగట్ల స్టేజీ వద్ద జనగాం వైపు వెళ్తున్న టిప్పర్ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లింగరాజు, రుత్విక తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. రుత్విక తండ్రి ఎడ్ల ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయిరాం తెలిపారు. లింగరాజు, చిన్నారి రుత్విక రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కంచుగట్లగూడెం, రాయినిగూడెం గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. విగతజీవులుగా పడి ఉన్న లింగరాజు, రుత్వికను చూసి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

బైక్ కొనివ్వడం లేదని యువకుడి ఆత్మహత్య

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

భువనగిరి: బైక్ కొనివ్వలేదని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలంలోని నందనం గ్రామానికి చెందిన స్వప్న కుమారుడు నిమ్మల శివమణి(17) ఐటీఐ చదువుతున్నాడు. కొద్దిరోజులుగా తనకు బైక్ కొనివ్వాలని తల్లిని అడుతుండగా ఆమె తర్వాత కొనిస్తానని చెబుతుండేది. ఎన్నిసార్లు అడిగినా తనకు బైక్ కొనివ్వడం లేదని మనస్తాపానికి గురైన శివమణి ఈ నెల 8వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి తల్లికి సమాచారం ఇవ్వగా, ఆమె ఇంటికి చేరుకుని బంధువులతో కలిసి 108వాహనంలో భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అదే రోజు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందతూ మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ఖతార్ దేశంలో చిట్యాల వాసి మృతి


ముబీన్ (ఫైల్)

చిట్యాల: పట్టణానికి చెందిన ఓ యువకుడు వృత్తిరీత్యా ఖతార్ దేశానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ఎండీ ముబీన్(34) ఖతార్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్నాడు. గత నెల 29వ తేదీన తాను పనిచేస్తున్న కార్యాలయంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అతడిని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. వీరు ప్రస్తుతం నల్లగొండలోనే ఉంటున్నారు. మృతుడి తల్లిదండ్రులు గతంలోనే మృతిచెందాడు. మృతుడు ఆరు నెలల క్రితమే ఖతార్ దేశానికి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ముబీన్ మృతదేహాన్ని భారత దేశానికి తీసుకొచ్చేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ చౌరస్తాలో మంగళవారం రాత్రి ముబీన్ చిత్రపటానికి అతడి స్నేహితులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు.


ఉరేసుకొని వృద్ధురాలు ఆత్మహత్య

హుజూర్‌నగర్: వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన చింతలపాలెం మండలం తమ్మారంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ హరీష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తమ్మారం గ్రామానికి చెందిన కలగొట్ల సుగుణమ్మ (67)కు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. వారందరికీ పెళ్లిళ్లు చేసింది. ఆమె భర్త కోటిలింగారెడ్డి ఏడాది క్రితం చనిపోయాడు. అప్పటి నుండి ఆమె ఒంటరిగానే ఉంటుంది. కాగా సుగుణమ్మ సోమవారం ఇంటి బయటకు రాకపోవడంతో స్థానికులు వెళ్లి చూడగా చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని ఆమె కూతుళ్లకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి చిన్న కూతురు సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరీష్‌రెడ్డి తెలిపారు. వయోభారంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుందా లేదా వేరే ఏమైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

క్రూడాయిల్ చోరీ

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామ పరిధిలో గల వాగ్దేవి సాల్వేంట్ ఆయిల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో తయారయ్యే ఆర్‌బీ క్రూడాయిల్ చోరీకి గురవ్వగా చిట్యాల పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. వాగ్దేవి సాల్వెంట్ ఆయిల్ పరిశ్రమలో తయారైన ఆర్‌బీ క్రూడాయిల్‌ను ట్యాంకర్‌లో లోడ్ చేసి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని నోముల గ్రామానికి పంపించారు. కాగా చిట్యాల పట్టణంలో భువనగిరి రోడ్డు శివారులోకి రాగానే ఆయిల్ ట్యాంకర్‌ను డ్రైవర్ సంతోష్ దారి మళ్లించగా, ట్యాంకర్ సీల్ తొలగించి అందులోని 105 లీటర్ల క్రూడాయిల్‌ను ప్రసాద్, నగేష్ అనే వ్యక్తులు చోరీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న పరిశ్రమ ప్రతినిధి చిన్నబాబు అక్కడకు వెళ్లి ఆయిల్ ట్యాంకర్‌ను పట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా క్రూడాయిల్ చోరీకి పాల్పడిన వారిలో నగేష్ పోలీసులకు పట్టుబడగా ప్రసాద్ పరారీలో ఉన్నాడు.

తండ్రి, అన్నను చంపిన వ్యక్తికి యావజ్జీవ శిక్ష


నిందితుడు నరేందర్

తుర్కపల్లి: ఆస్తి పంపకం విషయంలో తండ్రి, అన్నపై కక్ష పెంచుకొని హత్య చేసిన వ్యక్తికి భువనగిరికి ఏడీజే సెషన్స్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది. ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలం మల్కికుంటతండాకు చెందిన ధారవత్ జాలం, సుగుణ భార్యాభర్తలు. వీరికి కుమారులు భిక్షపతి, నర్సింహ ఉన్నారు. జాలం తనకున్న 11ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. కొన్నేళ్ల తర్వాత జాలం సుగుణ సొంత చెలెల్లు లక్ష్మిని రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు నరేందర్ పుట్టాడు. లక్ష్మిని పెళ్లి చేసుకున్న తర్వాత సుగుణకు, లక్ష్మికి తరచూ గొడవలు జరుగుతుండడంతో లక్ష్మి తన కుమారుడు నరేందర్‌తో కలిసి తల్లిగారింటికి వెళ్లి అక్కడే కూలీ పనులు చేసుకుంటూ ఉండేది. నరేందర్ అమ్మమ్మ ఇంటి వద్దే 10వ తరగతి వరకు చదువుకొని ఆ తర్వాత తండ్రి జాలం దగ్గరికి వచ్చాడు. ఈ క్రమంలో తండ్రి జాలం, అన్నలు తరచూ నరేందర్‌ను తిడుతుండేవారు. 7 సంవత్సరాల క్రితం నరేందర్ రాంపూర్ తండాకు చెందిన సునీతను ప్రేమ వివాహం చేసుకుంటానని తండ్రి జాలంను అడుగగా అందుకు ఆయన అంగీకరించలేదు. ఆమెను పెళ్లి చేసుకుంటే ఆస్తిలో వాటా ఇవ్వను అని చెప్పినప్పటికీ నరేందర్ ప్రేమించిన అమ్మాయినే పెళ్లి చేసుకున్నాడు. అంతేకాకుండా తన రెండో అన్న నర్సింహ తనను తరచూ తిట్టి అవమానిస్తున్నాడని అతడిపై నరేందర్ కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో తన తండ్రి మొదటి భార్య కుమారులైన భిక్షపతి, నర్సింహ పేరు మీద భూమి రిజిస్ట్రేషన్ చేయడంతో మరింత కక్ష పెంచుకున్నాడు. కాగా 2014లో హైదరాబాద్ నుంచి బైక్‌పై తండాకు వస్తున్న అన్న నర్సింహను రామోజీనాయక్ తండా సమీపంలో తన బావమరిది భగవాన్‌తో కలసి నరేందర్ కత్తులతో పొడిచి చంపి పారిపోయాడు. ఈ కేసులో నరేందర్ జైలు వెళ్లి వచ్చాడు. తన తండ్రి బతికి ఉన్నంత వరకు తనకు ఆస్తిలో వాటా ఇవ్వడని భావించి అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. 2018లో పని నిమిత్తం భువనగిరికి వచ్చి బైక్‌పై తండాకు వెళ్తున్న తండ్రి జాలంను నరేందర్ సుమోతో రుస్తాపూర్ గ్రామ శివారులో వెనక నుంచి ఢీకొట్టాడు. దీంతో రోడ్డుపై పడిపోయిన తన తండ్రి మీద నుంచి సుమోను తొక్కించాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న అన్న భిక్షపతి, బావ బిచ్చాలు కేకలు వేయడంతో నరేందర్ అక్కడి నుండి పారిపోయి మరుసటిరోజు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. అప్పటి నుంచి జైల్లో ఉన్న నరేందర్ ఉండగా.. ఈ కేసు విచారణలో భాగంగా మంగళవారం భువనగిరి ఏడీజే సెషన్స్ కోర్టు నరేందర్‌కు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించిందని ఎస్ఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Wanted

- ప్రముఖ గ్లోబల్ కంపెనీలో పార్ట్ / ఫుల్ టైం వర్క్ చేస్తూ ప్రతినెల 25 వేల పైన సంపాదించవచ్చు. అర్హత : ఇంటర్ పైన, గృహిణులు, రిటైర్డ్ పర్సన్స్, స్టూడెంట్స్ మరిన్ని వివరాలకు : 83745 31847 [V- 797219]
- ఆదాయం కోసం ఎదురు చూస్తున్నారా! నిరుద్యోగులకు ఉపాధి (పెట్టుబడి లేదు) స్వచ్ఛంద సేవా సంస్థనందు క్రౌడ్ ఫండింగ్ చేయుటకు జిల్లా కో-ఆర్డినేటర్ స్త్రీ/పు కావలెను. వీక్లీ 10K. 81439 09459. [M-1221335]
- ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221199]
- ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డు వ్రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్ : 70756 56208 [V-6179]
- VISA Consultation Overseas Blue & White Collar Jobs All Profiles Lucrative Salary Highpay. Interviews Vizag 9th to 11th July&Hyd. 13th&14th July. Ph: 9717618737 [HA-3289]

Services

- మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788601]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలిం చిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.